COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


ప్రచురణార్థం/ప్రసారార్థం :

విజయవాడ,
తేది : 21 ఏప్రిల్, 2022.

## మహిళలకు రక్షణ కల్పించాలి. నిందితులను శిక్షించాలి.

\- సిపిఐ(ఎం)

విజయవాడ గవర్నమెంటు హాస్పిటల్‌లో మానసిక వికలాంగురాలిపై అత్యాచార ఘటన పట్ల సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నది. నిందితులను కఠినంగా శిక్షించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నది.

దిశ యాప్ గురించి పదేపదే ఉపన్యాసాలు చెప్పే రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వారు నగరం మధ్యలో నిత్యం వందల మంది చికిత్స కోసం వచ్చే ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం జరుగుతున్నా ఆపలేకపోవడం సిగ్గు చేటు. రెండు రోజులపాటు యువతిని నిర్బంధించి ఉన్నా ఆసుపత్రి సిబ్బందికి గాని, అధికారులకు గాని కుటుంబ సభ్యులు కనిపెట్టి చెబితే తప్ప తెలియని స్థితిలో ఉందంటే సాధారణ ప్రజలకు ఏపాటి భద్రత కల్పిస్తున్నదో అర్థమవుతోంది. నిందితులమీద చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేసిన పోలీసు వారు బాధితురాలికి న్యాయం చేయాలని నిరసన తెలియజేస్తున్న సిపిఐ(ఎం) పార్టీ నాయకులను, ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేసి వేరు వేరు పోలీస్ స్టేషన్లకు తరలించడం శోచనీయం. అరెస్టు చేసిన వారిలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్. బాబూరావు, రాష్ట్ర కమిటి సభ్యులు డి.వి.కృష్ణ, డి.కాశీనాథ్, కె.శ్రీదేవి తదితరులు ఉన్నారు. అరెస్టు చేసిన నాయకులను కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి పరామర్శించడం జరిగింది.

స్మార్ట్ ఫోను, దిశ యాప్ ఉంటేనే మహిళలకు రక్షణ అని పోలీసులు హితబోధ చేసి చేతులు దులుపుకుంటే నేరాలకు అడ్డుకట్ట పడదు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారికి కనువిప్పు కలిగేలా ప్రభుత్వ చర్యలు ఉండాలి. మహిళల రక్షణ కోసం పోలీసు వ్యవస్థ చిత్తశుద్ధితో పని చేయాలి. అప్పుడు మాత్రమే ఈ నేరాలను ఆపడానికి వీలవుతుంది.

విజయవాడ ఘటనలో నేరస్థులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి తగు వైద్యం అందించి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేస్తున్నది. కంప్లైంటు ఇచ్చినా పట్టించుకోని పోలీసు సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోను, ఇతర ప్రాంతాల్లోను కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నది. మహిళలపై దురాగతాలకు ప్రేరేపిస్తున్న కారణాలను సమూలంగా రూపుమాపేందుకు దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నది.

(వి.శ్రీనివాసరావు)

రాష్ట్ర కార్యదర్శి